
సామాజిక, రాజకీయ, సినీ వారపత్రిక
చరిత్ర
నిన్న జరిగింది నేటి 'చరిత్ర' - నేడు జరిగేది రేపటి 'చరిత్ర'

TS-20-0147370
# మన మాట
ప్రతి పదం ప్రజల పక్షం
TELANAGANA సంపుటి 7 సంచిక 208

Stv SANDESH
ప్రతి మాట విలువైనది - ప్రతి దృశ్యం అరుదైనది

మంగళవారం | 20 జనవరి | 2026 | పేజీలు : 12
HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | AMARAVATHI | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) పరిధి విస్తరించింది. హైదరాబాద్ శివారు గ్రామాలు, మున్సిపాలిటీలన్నీ మహానగరంలో కలిసి పోయాయి. ప్రభుత్వం ఆర్డినెన్స్ కూడా జారీచేసింది. దీంతో, శివారు ప్రాంతాల్లో ఎన్నికల సందడి మ మొదలయ్యింది. గతంలో గ్రామ పంచాయతీలుగా ఉన్నప్పుడు సర్పంచ్లుగా పనిచేసిన వాళ్లు, మున్సిపాలిటీలుగా ఉన్న ప్రాంతాల్లో కార్పొరేటర్లుగా పదవులు అనుభవించిన వాళ్లు.. ఆయా పార్టీల్లో ప్రాధాన్యత సంపాదించి ఇప్పుడు వచ్చే ఎన్నికల్లో పోటీకి సమాయత్తమవుతున్న వాళ్లు.. ఇలా ఒక్కో చోట ఒక్కో రకంగా నాయకులు తారసపడుతున్నారు. అయితే, బౌరంపేటలో మాత్రం వీటన్నింటికంటే భిన్నమైన పరిస్థితుల్లో పోటీకి సిద్ధమవుతున్న నాయకుడు ఉన్నారు. నాయకుడన్న పదానికి నిలువెత్తు



# పేదలకు వెయ్యి ఇళ్లపట్టాలు

ఒక గ్రామ సర్పంచ్ కథ
రేపటి కార్పొరేటర్ కల

# జీవితంలో గుర్తుండే జ్ఞాపకం




- నెలల తరబడి ట్యాంకర్లతో నీళ్లు - వేసవిలో ఊరికి తీరిన దాహం
- పట్టుబట్టి బొందలగడ్డకు స్థలం - గర్వంగా చెప్పుకుంటున్న సందర్భం
- సర్పంచ్గా అనేక అభివృద్ధి పనులు - రాజకీయంగా ఒక అనుభవం
- భూపతిరెడ్డి అన్న మాటకు గౌరవం - పదవికన్నా పెద్ద మనసుతో త్యాగం
- నేలతో విడిపోని వ్యవసాయ బంధం - మట్టి మనిషి మంచి నాయకత్వం
- చివరి సంకల్పం - బౌరంపేట చారిత్రక ఉనికి కోసం ఒక అగ్ని శపథం
- రేవంత్ రెడ్డితో అనుబంధం - రాజకీయమే కాదు, కుటుంబ బంధం
- మిద్దెల యాదిరెడ్డి - ప్రజా, రాజకీయ ప్రస్థానం

నిదర్శనంగా నిలిచే వ్యక్తి ఆయన. రాజకీయం అంటే ఆయన దృష్టిలో కేవలం పోటీ, పదవి, అధికారం మాత్రమే కాదు.. అవకాశం వచ్చిందా? పదవిని అందుకో.. తనకు రాజకీయ మార్గదర్శకులు ఏదైనా ప్రతిపాదించారా? పెద్ద త్యాగమైనా చెయ్యి... అవకాశం అందిపుచ్చుకునే పరిస్థితి లేదా? ప్రజా సేవను మాత్రం మరిచిపోకు.. ఎప్పటిలాగే సేవలో నిమగ్నమవ్వు... ఇలా ఉంటాయి ఆయన ఆచరించే ఆదర్శవంతమైన మార్గదర్శకాలు. మరి.. ఇంతగా చెప్పుకుంటున్నాం కదా.. ఎవరాయన? ఈ స్థాయిలో ఆయనకు ఉపోద్ఘాతం అవసరమా? అంటే కచ్చితంగా అవసరమే అని చెప్పొచ్చు.

బౌరంపేట.. ఒకప్పుడు చిన్న గ్రామపంచాయతీ. ఇప్పుడు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్లో ఒక భాగం. ఇప్పుడు కాలం మారింది. కాల క్రమంలో ఊరు మారింది. కానీ, ఒక వ్యక్తి మాత్రం మారలేదు. ఆయనే మిద్దెల యాదిరెడ్డి.





ఈరోజు ఆయన పేరు బౌరంపేటలో ఎవరితో అయినా ప్రస్తావిస్తే.. మన యాదిరెడ్డి అన్న.. ఊరికి పని చేసినోడు అనే మాటే ముందుగా వస్తుంది. అది రాజకీయ ప్రచారం కాదు. అది మూడు దశాబ్దాల ప్రజా సేవకు వచ్చిన గుర్తింపు. ఇప్పుడు ఆయన మరో అడుగు ముందుకు వేయబోతున్నారు. వచ్చే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కార్పొరేటర్గా పోటీ చేయాలనే స్పష్టమైన నిర్ణయం తీసుకున్నారు. కానీ, ఆయన రాజకీయ ఆశలకన్నా మరో పెద్ద ఆశయం ఉంది. బౌరంపేటకు అసలైన పేరును తిరిగి తెచ్చే సంకల్పం. అదే ఆయన జీవిత ఆశయం. ఇది ఒక పదవి కోసం కాదు.. ఒక ఊరి ఉనికిని కాపాడేందుకు సాగుతున్న ప్రయాణం.





# తొలి రాజకీయ అడుగు





యాదిరెడ్డి రాజకీయ జీవితం అనుకోకుండా మొదలైంది కాదు. తాను యువకుడిగా ఉన్నప్పటినుంచే ఊరి సమస్యల గురించి పట్టించుకోవడం, అవసరమైతే ఎవరైనా నాయకులు, అధికారులు వస్తే వాటి గురించి ప్రస్తావించడం వంటి పరిణామాలతోనే బీజం పడింది. అలా.. 2009లో అప్పటి ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్తో కలిసి రాజకీయంగా యాక్టివ్ రోల్ పోషించారు. అప్పటి నుంచే గ్రామంలో చిన్న చిన్న సమస్యల పరిష్కారంలో ముందుండేవారు. డ్రైనేజీలు, నల్లాలు, మోరీలు, బోర్లు.. సమస్య ఏదైనా సరే.. ఎక్కడ అవసరం కనిపిస్తే అక్కడ యాదిరెడ్డి కనిపించేవారు. అలా.. సర్పంచ్ పదవిపై ఆశలు పెంచుకున్నారు. 2013లో కచ్చితంగా తానే సర్పంచ్ అవుతానని ఆశలు పెట్టుకున్నారు. గ్రామస్తులు కూడా నోట్లో నాలుకలా ఉండే యాదిరెడ్డినే తమ ప్రతినిధిగా ఎన్నుకోవాలని డిసైడ్ అయ్యారు. కానీ, ఆ ఆశలు, ఆకాంక్షలను రిజర్వేషన్ దూరం చేసింది. సర్పంచ్ పదవి ఎస్సీ మహిళకు రిజర్వ్ కావడంతో అనివార్యంగా దూరమయ్యారు. కానీ, ఆశను చంపుకోలేదు. గ్రామంలో తానే బాధ్యత తీసుకొని వార్డు సభ్యులందరినీ గెలిపించుకొని తాను కూడా వారిలో ఒక వార్డు మెంబర్ గా ఎన్నికై ఉప సర్పంచ్ పదవిని చేపట్టారు. ఇక్కడే రాజకీయాల్లో యాదిరెడ్డి ప్రత్యేకత మొదలైంది. పదవి కాస్త చిన్నదైనా.. పనిలో మాత్రం పెద్దతనాన్ని చూపించారు.

## నెలల తరబడి ట్యాంకర్లతో నీళ్లు - వేసవిలో ఊరికి తీరిన దాహం

బౌరంపేటలో ఎండాకాలం వచ్చిందంటే అప్పట్లో తీవ్ర నీటి కష్టాలు ఎదురయ్యేవి. ప్రజలు అష్ట కష్టాలు పడేవారు. దీంతో, గ్రామస్తుల కష్టాలు చూడలేక.. యాదిరెడ్డి తన సొంత డబ్బులతో వాటర్ ట్యాంకర్లు తెప్పించి నిత్యం నీళ్లు పంపిణీ చేసేవారు. అలా.. ఓ యేడాది వేసవి కాలమంతా సుమారు ఆరు నెలల పాటు రోజూ సొంత డబ్బులతో నీటి సరఫరా చేయించారు. ఇది అధికారం ఫైల్లో కనిపించే పని కాదు. ఇది మనిషి మనసులో నిలిచిపోయే పని. ఇప్పటికీ అప్పటి పరిస్థితులను తలచుకొని పెద్దవాళ్లు చెబుతూ ఉంటారు. ఆ సమయంలో యాదిరెడ్డి లేకపోతే నీళ్లకోసం పెద్ద గొడవలే జరిగేవని గుర్తు చేసుకుంటుంటారు.



## గవర్నమెంట్ స్కూల్ నుంచి గుడి వరకు...



ఉపసర్పంచ్గా ఉన్న సమయంలో గవర్నమెంట్ స్కూల్కి ఫిల్టర్ వాటర్ ప్లాంట్, ఏర్పాటు చేయించారు. స్కూల్లో చదువుతున్న పిల్లలకు అవసరమైన సదుపాయాలు కలిగేలా చూశారు. వ్యక్తిగతంగా పలు స్కూళ్లకు సాయం చేశారు. ఆ తర్వాత కాలంలో బౌరంపేటలో పాఠశాలల సంఖ్య భారీగా పెరిగింది. ప్రస్తుతం ఆ ప్రాంతంలో దాదాపు 16 పాఠశాలలు, 8 కాలేజీలు ఏర్పాటయ్యాయి. వాటిలో కార్పొరేట్, ఇంటర్నేషనల్ స్కూల్స్ కూడా ఉన్నాయి. అది ఊరి అభివృద్ధి బాటలో ఒక పెద్ద మలుపుగా చెప్పుకోవచ్చు. అలాగే, బంగారు మైసమ్మ ఆలయం గురించి చెప్పుకోవాలి. గ్రామస్తులను కాపాడే దేవతగా కొలిచే బంగారు మైసమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్టకోసం యాదిరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. అప్పటికి తాను సర్పంచ్, ఉప సర్పంచ్ కాకపోయినప్పటికీ.. అప్పటి ప్రతినిధులతో మాట్లాడి గ్రామ పంచాయతీ నుంచి 5 లక్షల రూపాయలు ఖర్చు చేయించి ఆలయం నిర్మాణం జరిగేలా చూశారు. ఆ దేవాలయం నిర్మాణం 2011లో పూర్తయ్యింది. అప్పుడు గుడి కట్టినప్పటి సంతోషం జీవితంలో ఎప్పటికీ మర్చిపోలేనని.. యాదిరెడ్డి చెప్పిన మాటల్లో నిజమైన భక్తి కనిపిస్తుంది.






## పేదలకు వెయ్యి ఇళ్లపట్టాలు - జీవితంలో గుర్తుండే జ్ఞాపకం


బౌరంపేటలో ఇంటి స్థలాలు లేని నిరుపేదలకు సొంత గూడు వచ్చేలా చొరవ తీసుకున్నారు యాదిరెడ్డి. అప్పటి ముఖ్య నాయకులు ఎమ్మెల్యే శ్రీశైలం గౌడ్, సర్పంచ్ వీరేశం గౌడ్ సహకారంతో గ్రామంలో వెయ్యి మందికి ప్రభుత్వం నుంచి ఇళ్ల పట్టాలు ఇప్పించారు. ఇది కేవలం కాగితాలు, కేటాయింపుల సర్టిఫికెట్ల పంపిణీ మాత్రమే కాదు.. పేద కుటుంబాలకు 'ఇది నా భూమి' అనే గర్వాన్ని ఇచ్చిన పరిణామం. ఇది తనకు జీవితాంతం గుర్తుండి పోయే జ్ఞాపకమని చెబుతారు యాదిరెడ్డి.







# కేసులు, కష్టాలు - కానీ వెనక్కి తగ్గని ధైర్యం







ఉప సర్పంచ్ గా ఉన్న సమయంలో అనుకోని పరిస్థితులు తటస్థించాయి. అప్పటి సర్పంచ్తో విభేదాలు చెలరేగాయి. దీంతో, యాదిరెడ్డిపై ఎస్సీ ఎస్టీ కేసులు పెట్టారు. రాజకీయంగా ఒత్తిడులు తీసుకొచ్చారు. ఈ పరిణామాల కు సాధారణ మనిషైతే వెనక్కి తగ్గేవారు. కానీ, యాదిరెడ్డి అలా కాదు. తాను ముక్కుసూటిగా, ప్రజల కోసం పనిచేయాలనుకుంటున్నప్పుడు, అభివృద్ధికోసం పాకులాడుతున్నప్పుడు, ప్రజలకు సేవ చేయాలనుకుంటు న్నప్పుడు ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదనుకున్నారు. ధైర్యంగా కేసులు ఎదుర్కొన్నారు. ఎవరినీ బాధించకుండా, తన బాధ తానే భరించాడు. కనీసం ప్రతీకారం తీర్చుకుందామని కూడా అనుకోలేదు. తన దారి రహదారి అనుకున్నారు. అదే సమయంలో... తన నిబద్ధతకు ప్రతిరూపంగా కలెక్టర్ ద్వారా 6 నెలల పాటు సర్పంచ్ పదవి వరించింది. ప్రజా సేవ చేయాలనుకునే వాళ్లకు సమయం పరిమితి పెద్ద లెక్క కాదు. ఆ ఆరు నెలల్లోనే గ్రామంలో సుమారు 3 కోట్ల రూపాయల విలువైన పనులు చేయించారు. డ్రైనేజీలు, సీసీ రోడ్లు, నల్లాలు, బోర్లు.... ఒకటేమిటి.? ఏది అవసరమైతే అది చేయించారు. ఇవన్నీ రికార్డుల్లో కనిపిస్తాయి. అంతెందుకు.. ఆయా శిలాఫలకాల మీద కూడా యాదిరెడ్డి పేరు కనిపిస్తుంది.

## భూపతిరెడ్డి అన్న మాటకు గౌరవం - పదవికన్నా పెద్ద మనసుతో త్యాగం

సర్పంచ్గా తన పదవీ కాలం పూర్తయిన తర్వాత బౌరంపేట మున్సిపాలిటీగా మారిపోయింది. 2018లో మున్సిపాలిటీ ఎన్నికలు వచ్చాయి. సర్పంచ్గా అనుభవం ఉంది. తాను చేసిన అభివృద్ధి కనిపిస్తూ ఉంది. సొంతంగా పోటీ చేయగల స్థాయి ఉంది. కానీ, భూపతి రెడ్డి అన్న మాటకు గౌరవం ఇచ్చి పోటీ చేయకుండా త్యాగం చేశారు యాదిరెడ్డి. ఇక్కడే పదవికన్నా సంబంధాలకు విలువనిచ్చే యాదిరెడ్డి స్వభావం, ప్రత్యేకత చూడొచ్చు.


## బీఆర్ఎస్తో ప్రయాణం - స్నేహం, సేవ

రెండు సంవత్సరాలు బీఆర్ఎస్లో ప్రయాణం చేశారు యాదిరెడ్డి. తనకు చిన్ననాటి నుంచే స్నేహం ఉన్న శంభీపూర్ రాజు ఆకాంక్ష మేరకు బీఆర్ఎస్లో చేరారు. ఆ సమయంలో శంభీపూర్ రాజు చాలా ఆదరించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో, పార్టీ కార్యక్ర మాల కోసం ఎక్కడెక్కడికో వెళ్లి ఆందోళనలు చేశారు. అంతే కాదు.. తనకున్న అభిమానంతో శంభీపూర్ రాజు స్వగ్రామంలో కమ్యూనిటీ హాల్ నిర్మిస్తే.. తమ గ్రామపంచాయతీ తరపున దాదాపు 30 లక్షల రూపాయలు సహాయం చేశారు. యాదిరెడ్డి పార్టీ మారినా.. తన సేవాభావం మాత్రం మార్చుకోలేదు. కొన్నాళ్లే బీఆర్ఎస్లో ప్రయాణం చేసినా.. తిరిగి సొంత గూటికి చేరుకున్నారు.

## వ్యవసాయం - నేలతో విడిపోని బంధం


యాదిరెడ్డి వ్యవసాయ కుటుంబంలో పుట్టిన వాడు. చిన్నప్పటి నుంచీ వ్యవసాయ పనులు చేస్తూ పెరిగిన వాడు. రాజకీయాల్లోకి వచ్చినా, ప్రజా సేవలో నిమగ్నమైనా.. తన వ్యవసాయ ఆలోచనలు మాత్రం మార్చుకోలేదు. మట్టిని మరిచిపోలేదు. అందుకే.. ఈరోజు కూడా యాదిరెడ్డి ఇంట్లో రెండు ఆవులు, సొంత కూరగాయ తోట, సొంత పండ్ల చెట్లు ఉంటాయి. ఆహారం, కూరగాయలు తమ తోటలోనే పండుతాయి. పాలు, పెరుగు ఇంట్లోనే తయారవుతాయి. ఏ పండు తినాలన్నా.. తమ తోటలోని పండ్లే ఎప్పుడూ ఇంట్లో అందుబాటులో ఉంటాయి. మట్టి మీద ఉండే మమకారం, తృప్తి ఇంకెక్కడా దొరకదంటారు యాదిరెడ్డి. ఇది రాజకీయ నాయకుడి మాట కాదు. ఇది మట్టిలో పుట్టి పెరిగిన మనిషి మాట.















# రేవంత్ రెడ్డితో అనుబంధం రాజకీయమే కాదు, కుటుంబ బంధం





ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. గతంలో మల్కాజ్ గిరి పార్లమెంటు స్థానం నుంచి ఎంపీగా పోటీ చేసినప్పటినుంచీ యాదిరెడ్డికి ఆయనతో బలమైన అనుబంధం ఉంది. ఎన్నికల సమయంలో స్థానిక ఎమ్మెల్యే శ్రీశైలం గౌడ్.. యాదిరెడ్డిని రేవంత్ రెడ్డికి పరిచయం చేశారు. అప్పటి నుంచి రేవంత్ రెడ్డి - యాదిరెడ్డి అనుబంధం గాఢంగా అలుము కుంది. ఎన్నికల ప్రచారంలో కలిసి, మెలిసి తిరిగామని, తాను ఏది చెప్పినా రేవంత్ రెడ్డి కాదనేవారు కాదని యాదిరెడ్డి ఇప్పటికీ గర్వంగా చెప్పుకుంటారు. తాను ఎక్కడికి తీసుకెళ్లినా వచ్చేవారని అంటారు. ముఖ్యమంత్రి అయిన తర్వాత కూడా తమ బంధం అలాగే కొనసాగుతోందన్నారు. ఎంతగా అంటే.. రేవంత్ రెడ్డి తన సోదరుడి కూతురు పెళ్లికి.. ప్రత్యేకంగా యాదిరెడ్డి కుటుంబానికి కారు పంపించారంటే ఆ బంధం ఎంత గాఢమైందో అర్థం చేసుకోవచ్చు. ఈ పరిణామం.. వాళ్ల మధ్య ఉన్న సాన్నిహిత్యానికి ప్రత్యక్ష సాక్ష్యంగా చెప్పుకోవచ్చు. ఈరోజు రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయినా యాదిరెడ్డి కనిపిస్తే చాలు.. యాదిరెడ్డి బాగున్నావా? పిల్లలు బాగున్నారా? అని పలకరించే ఆప్యాయత కొనసాగుతోంది. అందుకే యాదిరెడ్డి రేవంత్రెడ్డిని నాయకుడిగా కాదు - తమ కుటుంబసభ్యుడిగా చూస్తారు.



## గ్రామ సమస్యలు - స్పష్టమైన విజన్

బౌరంపేటలో ఏం చేయాలన్న అంశంపై యాదిరెడ్డికి స్పష్టమైన విజన్ ఉంది. పుట్టి పెరిగిన ఊరు, ఉప సర్పంచ్, సర్పంచ్గా పనిచేసిన అనుభవంతో ఎక్కడెక్కడ ఏ సమస్యలున్నాయో, వేటిని ప్రాధాన్యత క్రమంలో ముందు పరిష్కరించాలో క్లారిటీ ఉంది. గ్రామంలో ముందుగా రోడ్లు వెడల్పు చేయాలి, ఎందుకంటే పదుల సంఖ్యలో స్కూళ్లు, కాలేజీలు, నిత్యం స్థానికుల కార్ల రద్దీతో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉందని, దాన్ని పరిష్కరించాలని చెబుతారు. అలాగే, నీటి సమస్యను కూడా ప్రధానంగా ప్రస్తావిస్తున్నారు. ప్రతి వేసవిలో ట్యాంకర్ల మీద ఆధారపడాల్సి వస్తోందని, ఇకపై ఆ అవసరం లేకుండా చూడాలంటారు. తాను కార్పొరేటర్గా గెలిస్తే.. మొదట నీళ్ల సమస్య పరిష్కారం. ఆ తర్వాత రోడ్ల విస్తరణ అంటారు. అంతేకాదు.. 166 సర్వే నెంబర్లో ఉన్న 10 ఎకరాల స్థలాన్ని 5 ఎకరాలు స్కూల్కు, మరో 5




ఎకరాలు స్పోర్ట్స్ గ్రౌండ్కు కేటాయించేలా చొరవ చూపిస్తానంటున్నారు. ఎందుకంటే.. స్కూల్ విస్తరించినా బిల్డింగ్ పెరగలేదంటారు. అలాగే, గ్రామంలోని పిల్లలు ఆడుకోవాలంటే సరైన స్థలం లేదని ఆవేదన చెందుతారు.

## కాష్టాలు - సామాజిక సంస్కరణ

ఊరిలో మరణించిన వారికి బొందలు పెట్టడం ఆనవాయితీగా వచ్చేది. కానీ, స్మశానానికి అవసరమైనంత స్థలం లేదు. అందుకే.. అప్పుడే ప్రత్యేకంగా బొందలగడ్డకు స్థలం కేటాయించేలా చూశారు యాదిరెడ్డి. అంతటితో ఊరుకోలేదు. ఎవరైనా చనిపోతే.. సమాధి చేయొద్దని, దహన సంస్కారాలు చేయాలని యాదిరెడ్డి గ్రామంలో అందరికీ కొన్నేళ్ల పాటు చెబుతూ వచ్చారు. మొదట ఈ ప్రతిపాదనపై విమర్శలు వచ్చాయి. కానీ,. తర్వాత వారిలోనే ఆలోచన కలిగింది. యాదిరెడ్డి సూచనలో ఒక విజన్ ఉందనుకున్నారు. ఇప్పుడు బౌరంపేటలో సమాధులు కాదు.. చాలామంది కాష్టాలే (శవ దహనాలు) చేస్తున్నారు.


## చివరి సంకల్పం - బౌరంపేట చారిత్రక ఉనికి కోసం ఒక శపథం

ఇక, యాదిరెడ్డి ఆశయం ఏంటంటే బౌరంపేట చారిత్రక ఉనికిని కాపాడటం. తమ ఊరి పేరును తిరిగి వాడుకలో చేర్పించడం. బౌరంపేట అసలుపేరు 'భ్రమరాంబికా పేట' అని యాదిరెడ్డి చెబుతున్నారు. గ్రామంలోని అమ్మవారి ఆలయానికి 500 నుంచి 600 సంవత్సరాల చరిత్ర ఉందని అంటున్నారు. అంతేకాదు.. ఊరిపేరు మొదట్లో అమ్మవారి పేరునే ఉండేదని పెద్దలు చెప్పారట. ఇప్పుడు యాదిరెడ్డి ఆ సంకల్పాన్ని నెరవే ర్చడంలో నిమగ్నమయ్యారు. 'పదవి వచ్చినా రాకున్నా.. సీఎం దృష్టికి తీసుకెళ్లి



అయినా సరే.. మా ఊరి పేరు భ్రమరాంబికా పేటగా మార్పిస్తా'. అని చెబుతున్నారు. ఇది ఎన్నికల వాగ్దానం కాదు. ఇది ఒక భక్తుడి ప్రతిజ్ఞ. ఒక గ్రామ పుత్రుడి గౌరవ





ఆరాటం. మిద్దెల యాదిరెడ్డి అంటే... ఒక నాయకుడు మాత్రమే కాదు. ఒక సేవకుడు. ఒక రైతు. ఒక భక్తుడు. ఒక కుటుంబసభ్యుడు. ఒక గ్రామ సంస్కర్త. రేపు వచ్చే ఎన్నికల్లో యాదిరెడ్డి కార్పొరేటర్ కావడం ఖాయమని స్థానికులు ఘం టాపథంగా చెబుతున్నారు. యాదిరెడ్డి మాత్రం తమ గ్రామానికి 'భ్రమ రాంబికా పేట'గా తిరిగి నామకరణం జరిగి తీరుతుందంటున్నారు. తన కల నిజమవుతుందని నమ్మకంగా చెబుతున్నారు.

అనిల్ కుమార్ కుంట....
సందేశ్ మీడియా...
93933 44405